క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దామెర : మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన ముత్యాల గణేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కునాటి సునీల్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండు రాము, నాయకులు రాజిరెడ్డి, విద్యాసాగర్, నరసింహా రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, విజయ్, సాంబయ్య, సందీప్, శ్రీను, వినయ్, శ్రీనివాస్, కార్తీక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బెనిఫిట్స్ చెల్లించాలని కార్మికుల ఆందోళన



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని శ్రీరస్తు, కళ్యాణలక్ష్మి షాపింగ్‌మాళ్లలో పనిచేసిన కార్మికులు గురువారం ఆయా షాపింగ్ మాళ్ల ఎదుట ధర్నా చేశారు. దాదాపు 38 ఏళ్ల పాటు ఆయా షాపింగ్ మాళ్లలో పనిచేశామని, తమకు కార్మిక చట్టపరంగా రావాల్సిన సర్వీసు, బోనస్, బకాయి పీఎఫ్, ఇతర లావాదేవీలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ ఆయా షాపింగ్ మాల్ యాజమాన్యాలు కార్మికులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా 2024, అక్టోబర్‌లో దుకాణాలు మూసివేశాయని అన్నారు. కాగా, సమాచారం అందుకున్న హనుమకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. వెంకటేశ్వర్లు, వెంకట్ నారాయణ, నాగరాజు, జయ, రాధిక, రమాదేవి, లావణ్య, ఎజాస్, సందీప్, మహేష్, నవీన్, అమీద్, రాజేష్‌ఖన్నా, సురేష్, ప్రవీణ్, రమేష్, మహేందర్, యాదగిరి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కు తెలుగు వర్సిటీ ఎంఫిల్ పట్టా ప్రదానం

హన్మకొండ కల్చరల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణం నుంచి ఎంఫిల్ పట్టాను వరంగల్ జిల్లా, ఐనవోలు మండలం, సింగారం గ్రామానికి చెందిన సోనబోయిన సతీష్ అందుకున్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠం నుంచి తెలుగు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ భట్టు రమేష్ ఆధ్వర్యంలో 'ముదిరాజుల వృత్తి – జీవన విధానం' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు ఎంఫిల్ పట్టాను వర్సిటీ అందజేసింది.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

హసన్‌పర్తి: ఒకటో డివిజన్ ముచ్చర్లలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు పరీక్ష ప్యాడ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వరుణ్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు నరేష్, నాయకులు కర్ణాకర్, భరత్, కార్తీక్, జగన్, రాము, హరీశ్, నవీన్, ఎలియా తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల అందజేత

కేయూ క్యాంపస్: జాతీయ జూట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బోధనేతర సిబ్బందికి జ్యూట్ బ్యాగులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి గురువారం పంపిణీచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కరుణాకర్, సదాశివ్, ఫిరోజ్, సతీష్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డు కలిగి ఉండాలి

హన్మకొండ చౌరస్తా: భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు తప్పనిసరిగా కార్మికశాఖ గుర్తింపు కార్డు కలిగి ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నారాయణ స్వామి అన్నారు. హనుమకొండ కలెక్టరరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో పది, ఇంటర్, బీటెక్ చదువుతున్న ఎనిమిది మంది కార్మికుల పిల్లలకు ఉపకార వేతన చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికశాఖ గుర్తింపు కార్డు వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందవచ్చని నారాయణస్వామి వివరించారు. ప్రతిఒక్కరూ లేబర్ కార్డు పొందాలని అన్నారు. విద్యార్థులు సైతం అవగాహన కల్పించాలని సూచించారు.

రుద్రమదేవి విగ్రహం ఏర్పాటు

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన మెట్ల బావి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాకతీయుల నాటి నిర్మాణ శైలి ఉట్టిపడేలా బావి సుందరీకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ ఆదేశాలతో మెట్లబావికి మరింత అందం వచ్చేలా రాణి రుద్రమాదేవి విగ్రహాన్ని హనుమకొండ భీమారం గ్రామానికి చెందిన శిల్పి చెట్లపల్లి రాజమౌళి రూపొందిస్తున్నారు.

సమస్యల్లో 'ప్రాథమిక విద్య'



ఆరుబయట పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు



గొల్లవాడ ప్రాథమిక పాఠశాల

- అత్మకూరులో ఐదు క్లాసులకు రెండే గదులు
- రెండు పాఠశాలలకు ఒకటే భవనం
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఆత్మకూరు : విద్యార్థికి ప్రాథమిక విద్య కీలకం.. ప్రాథమిక దశలోనే విద్యార్థి చురుకుగా విద్యను అభ్యసిస్తాడు. ఈ విద్య ఉన్నత చదువులకు పునాదిగా నిలుస్తుంది. అంతటి ప్రాముఖ్యం ఉన్న ప్రాథమిక విద్య పరిస్థితి ఆత్మకూరు మండల కేంద్రంలో అధ్వానంగా మారింది. మండల కేంద్రంలో పోచమ్మ సెంటర్ వద్ద కేంద్ర ప్రాథమిక పాఠశాల, మజీద్ సమీపంలో గొల్లవాడ ప్రాథమిక పాఠశాలు ఉన్నాయి. అయితే పోచమ్మసెంటర్‌లోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో ఈ పాఠశాలను గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి ఆ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నదనే సాకుతో సబ్‌సెంటర్ నిర్మాణం కోసమని ఆ పాఠశాల భవనాలను కూల్చివేశారు. దీంతో ఒక గొల్లవాడ ప్రాథమిక పాఠశాల మాత్రమే కొనసాగుతోంది. ఈ పాఠశాల భవనంలో రెండే క్లాస్ రూమ్‌లు ఉండగా ఐదు తరగతులు నడుస్తున్నాయి. ఐదు తరగతులకు గాను 68 మంది విద్యార్థులున్నారు. మూడు తరగతులు పాఠశాల ఆవరణలో కొనసాగుతున్నాయి. ఎండకు, వానకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనానికి కూడా వసతులు లేక తంటాలు పడుతున్నారు. గొల్లవాడ ప్రాథమిక పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు ఉండగా పోచమ్మసెంటర్ కేంద్ర ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. 68మంది విద్యార్థులకు 6గురు ఉపాధ్యాయులు ఉండగా సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు పంపించడానికి ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా మంత్రులు, జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టిసారించి రెండు పాఠశాలలకు వేర్వేరుగా అధునాతన భవనాలు నిర్మించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.



కూల్చేసిన పోచమ్మ సెంటర్ ప్రాథమిక పాఠశాల

ఆరుబయటే చదువుకుంటున్నాం



సరిపడా గదులు లేక ఆరుబయట చదువుకుంటున్నాం. ఎండా కాలం, వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మాకు కొత్త భవనం కట్టించాలి. క్లాసులు వినడం కష్టంగా ఉంది.

-ప్రవళిక, విద్యార్థిని

పాఠశాలలో కనీస వసతులు లేవు



మా తల్లిదండ్రులు సర్కారు స్కూలుకు పంపిస్తున్నారు. ఇక్కడ వసతులు మాత్రం లేవు. స్కూల్లో సరిపడా గదులు లేకపోవడంతో ఎండాకాలం, వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు పడతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి భవనాలు నిర్మించాలి.

- చరణ్, విద్యార్థి

ఉన్నతాధికారులకు నివేదించాం..



ఐదు తరగతులను రెండు గదుల్లో నిర్వహించడం ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. నూతన భవనాలకు నిధులు మంజూరు చేసి నిర్మిస్తే బాగుంటుంది. విద్యార్థులకు ఇబ్బందుల నుంచి విముక్తి కలుగుతుంది.

-పెండెం రాజు, హెచ్‌ఎం

చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే సహించం

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య ధ్వజం



మాట్లాడుతున్న రాజయ్య

ధర్మసాగర్ : చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే సహించేదిలేదని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జానకిపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కురుసపల్లి రమేశ్ శివరాత్రి రోజున దొంగలు ఉన్నారు జాగ్రత్త అంటూ పలు పోస్టులు పెడితే అతడిపై పోలీస్‌లు కేసు పెట్టి స్టేషన్‌కు తరలించి విచక్షణారహితంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి బీఆర్‌ఎస్ శ్రేణులపై అకారణంగా దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. కురుసపల్లి రమేశ్‌ను బూతులు తిడుతూ దౌర్జన్యంగా కొట్టిన సీఐ, ఎస్సైలపై చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచిన కడియం శ్రీహరి రాజకీయ సమాధి చేయడం తప్పదని హెచ్చరించారు. కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారని ఘాటు విమర్శలు చేశారు. కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గుచేటని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన పనులే చూపించి తాను అభివృద్ధి చేస్తున్నట్లు అసత్య ప్రచారం చేసుకోవడం శ్రీహరికే చెల్లుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ కర్ర సోమిరెడ్డి, సీనియర్ నాయకులు బొడ్డు ప్రభుదాస్, లాల్‌మహ్మద్, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీలు రవీందర్, శోభ, జోజి, బాలరాజు, విజయ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

- డాక్టర్ నర్సింగరావు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నర్సింగరావు

ఆత్మకూరు : ఎన్‌సీడీ (నాన్‌కమ్యూనబుల్ డిసీజ్) వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉంటూ తమ జీవన శైలిని మెరుగుపర్చుకోవాలని డాక్టర్ నర్సింగరావు అన్నారు. మండలంలోని నీరుకుళ్ల సబ్‌సెంటర్‌లో ఎన్‌సీడీ రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ.. 44 మంది బీపీ, 18మంది డయాబెటిస్, 10మంది జనరల్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పౌష్టికాహారం తగిన మోతాదులో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనిల్‌కుమార్, సాంబయ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన మొక్కజొన్న

- పరిశీలించిన ఏఓ గంగాజమున



నేలకొరిగిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఓ గంగాజమున

శాయంపేట : మండల కేంద్రంలో బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలుల కారణంగా మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. ఈ మేరకు మండల వ్యవసాయశాఖ అధికారి గంగాజమున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తమకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలనే విధంగా చూడాలని రైతులు వేడుకున్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. మండల కేంద్రానికి రైతులు దుంపల రంజిత్‌కు చెందిన 3ఎకరాలు, దుంపల నాగిరెడ్డికి చెందిన ఒక ఎకరం, చెరుకు గోపాల్‌రెడ్డి ఎకరన్నర, దుంపల పద్మకు చెందిన 2 ఎకరాలు, దుంపల పుష్పలీలకు చెందిన రెండున్నర ఎకరాలు, దుంపల రాజుకు చెందిన ఎకరం, నల్ల సునీతాకు చెందిన రెండున్నర ఎకరాల మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలకొరిగాయని తెలిపారు. ఈ వివరాలు ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టపరిహారం అందేలా చేస్తామన్నారు. రైతులు అధైర్య పడొద్దన్నారు. ఆమె వెంట ఏఈఓ అర్చన, తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- కాంగ్రెస్ జిల్లా నాయకుడు రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

పరకాల : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు సోదా రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎఫ్‌జే గార్డెన్‌లో 16వ వార్డు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బండి శ్రీధర్ అధ్యక్షత వహించగా రామకృష్ణతో పాటు మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్ రావు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వార్డులో, గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గోనాథ్, ఓంటేరు రాంమూర్తి, సంపత్‌కుమార్, రంజాన్‌అలీ, వెంకటేశ్వర్లు, జయమ్మ, డాక్టర్ శ్రీను, రాజమౌళిగౌడ్, శ్రీనివాస్, రమేశ్, రాజేందర్, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'అకుట్' కార్యవర్గానికి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎల్ పీ.రాజ్‌కుమార్‌ను యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు గురువారం సన్మానించారు. మంద వీరస్వామి, పాలకుల కొమురయ్య, వడ్డెపెల్లి మధు, కలకొట్ల సుమన్, ఆలువాల కార్తీక్, క్లోపెల్లి ప్రశాంత్, వెంకటేశ్వర్లు, బొట్ల మనోహర్, సూరాసి కృష్ణ, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే వాకథాన్



హన్మకొండ అర్బన్: జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం వద్ద గురువారం చేపట్టిన 2కే వాకథాన్‌ను ఎంపీ కడియం కావ్య జెండా ఊపి ప్రారంభించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకథాన్ పబ్లిక్ గార్డెన్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. తెలంగాణ ఐడీఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయసింహ రెడ్డి, జిల్లా కార్యదర్శి వేణుయాదవ్, డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

ఎంజీఎం: వైద్యారోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగికి, వైద్యుడికి మధ్య ఫార్మసిస్టులు వారధి లాంటి వారని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసి సమస్యలు విన్నవిస్తామని తెలిపారు. ఫార్మసీ ఆఫీసర్ జీఓ వచ్చిన వెంటనే టీజీపీఏ ఆధ్వర్యంలో త్వరలోనే అన్ని జిల్లాల ఫార్మసిస్టులతో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

అతివలు సంఘటితం కావాలి

నయీంనగర్: ఈనెల 8న జరగనున్న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజాదేవి కోరారు. మహిళల హక్కుల కోసం అతివలు సంఘటితం కావాలని సూచించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వడ్డేపల్లి రోడ్డు కనకదుర్గ కాలనీ వైష్ణవి బాంక్వెట్ హాల్‌లో వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

కమలాపూర్ : మండల కేంద్రంలోని విద్యుత్ ఏఈ కార్యాలయ ఆవరణలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్, ఉప్పల్, ఎల్కతుర్తి సెక్షన్ల పరిధిలో ఉన్న గ్రామాల వినియోగదారులు ఈ లోకల్‌కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలున్న మీటర్ల మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వినియోగం కంటే ఎక్కువ మొత్తంలో గల బిల్లుల కేటగిరీ మార్పు, సర్వీసు రద్దు తదితర సమస్యలకు సంబంధించి విద్యుత్ వినియోగదారుల నుంచి రాతపూర్వక ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ లోకల్ కోర్టును విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం సభను జయప్రదం చేయాలి


వేలేరు : ఈనెల 16న సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల గ్రామ కమిటీలను సమన్వయం చేస్తూ నేటి నుంచి ఆయా గ్రామాల్లో సభ విజయవంతం చేసేందుకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ బ్రేకర్ ప్రారంభం



శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో 11కేవీ ఫీడర్ ఏర్పాటు చేసి నూతన బ్రేకర్‌ను విద్యుత్ శాఖ డీఈఈ సామ్యనాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమ్మర్ యాక్షన్‌లో భాగంగా ప్రగతి సింగారం 11/33 కేవీ సబ్ స్టేషన్‌లోని 11కేవీ ఫీడర్ కాత్రపల్లి, ప్రగతి సింగారం ఫీడర్లను వేరు చేయడం జరిగిందన్నారు. ఏడీఈ దేవేందర్‌నాయక్, శాయంపేట ఏఈ చందూలాల్ పాల్గొన్నారు.

వేతనాల కోసం వర్కర్ల ఆందోళన



హన్మకొండ అర్బన్: 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కాకతీయ వైద్య కళాశాల హాస్టళ్లలో పనిచేస్తున్న 86మంది కార్మికులు హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.యాదానాయక్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పెండింగ్‌లో జీతాలు ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు జీలపల్లి సుధాకర్, అల్లం రమేష్, డి.రాణి, అతీక్, శరత్, ప్రశాంత్, కోమల పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే



వేలేరు : మాట్లాడుతున్న రాజు



ఎల్కతుర్తిలో సంబురాలు చేసుకుంటూ..

- పార్టీ వేలేరు మండలాధ్యక్షుడు రాజు

వేలేరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాత్రేవుల రాజు అన్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. బాణాసంచ కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని, వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. బీజేపీ నాయకులు కీర్తి సురేశ్, దామోదర్ రెడ్డి, కిరణ్, శివాజీ, నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపొందిన సందర్భంగా బీజేపీ నాయకులు గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సంబురాలు జరుపుకొన్నారు. అంతకుముందు బస్టాండ్ నుంచి కూడల్ సెంటర్ వరకు బ్యాండ్ మేళాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాణాసంచ పేల్చి స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రామోజు శ్రీనివాస్, మంతుర్తి శ్రీకాంత్, మాజీ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాయకులు కొమురయ్య, వెంకటేశ్, శ్రీవర్ధన్, మధు, సారయ్య, రాణాప్రతాప్, కిషన్, సదానందం, కిష్టయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్



విజేతలతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పరకాల : విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకే టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఏడాది టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. చెడు మార్గాలకు దూరంగా ఉండాలని అన్నారు. వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంటర్‌నెట్‌ను అవసరాల నిమిత్తమే వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధు, ఉపాధ్యాయులు పుష్ప, రమాదేవి, సాంబయ్య, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుతో తీవ్ర అనారోగ్యం



ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న జంగా, అడ్‌హక్ కమిటీ సభ్యులు

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని అడ్‌హక్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించాలని కోరుతూ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజ్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో మడికొండ, రాంపూర్, అయోధ్యపురం, ఎలుకుర్తి, ధర్మసాగర్, తదితర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని వాపోయారు. అడ్‌హక్ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ రాజుయాదవ్, కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రావు, శంకర్, కుమార్ బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిలిపేసిన ఫలితాలను విడుదల చేయాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సంబంధించి డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను నిలిపివేయడం సరికాదని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. ఈమేరకు పరిపాలన భవనం ఎదుట గురువారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. నిలిపివేసిన ఫలితాలను వెంటనే విడుదల చేయాలని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కావ్య, బాధ్యులు గణేష్, చందన, యాదగిరి, సాధన తదితరులు పాల్గొన్నారు.